
# తల్లి భిక్షం

భూపాల్

నిండు పెళ్లి పందిరిలో భోరున ఏడుస్తున్న తల్లిని వారిస్తున్నారు బంధువులు. కొందరామెను పక్కకు తీసికెళ్లి "మీ బాబును తప్పకుండా పట్టుకుంటాం. చాలా మంది వెతకడానికి వెళ్లారు. నువ్వేం కంగారుపడకు" అంటూ సముదాయిస్తున్నారు.

సికింద్రాబాద్ దగ్గరవున్న మెట్టుగూడ లోపలి బస్తీలో పెళ్లి. వర్షంలోనైనా చాలా వరకు బంధువులు వచ్చారు. పెళ్లి ఐపోయింది. రెండు గంటలు పడుతూ, ఆగుతూ, మళ్లీ పడుతూ వుండిన వర్షం ఆగి ఇప్పుడు సన్నని ముసురు పెడుతుంది. ముందు పదిగంటల ప్రాంతంలో కురిసి వెలిసిన వర్షం తర్వాత మళ్లీ ప్రారంభమైన ఆ పది నిముషాల లోపలే బాబు ఆడుకుంటూ, ఆడుకుంటూ అంత వర్షంలో సైతం ఐస్‌క్రీం బండివాడి కోసం పరిగెత్తాడని ఎవరో పాప చెప్పింది. ఆ బాబు వయస్సు రెండు సంవత్సరాలే.



రెండు గంటలుగా వెదుకుతున్న వదిమందికి ఎన్ని సందులు గొందులు తిరిగినా, రోడ్డుపైన ప్రతి వారినీ, దుకాణాల వాళ్లని అడిగినా మేం చూడలేదంటే మేం చూడనే లేదంటున్నారు. తండ్రి భాస్కరరావు ఏడ్వకున్నా కొడుకును తల్చుకొని ఏమయ్యాడా అని భయంతో, బెంగతో విలవిలలాడిపోతున్నాడు. తనకు స్కూటర్ నడిపించే ఓపిక, ధైర్యం కూడా లేక తన బావమరిదితో వెనక కూర్చుండి ప్రతి వీధీ వెదుకుతున్నాడు. కొందరు పోలీస్‌స్టేషన్ వైపుకీ, కొందరు చుట్టుపట్ల జరుగుతున్న పెళ్లిళ్ల వైపుకీ పరుగు తీశారు. రెండు గంటలైపోయింది. బాబు దొరకలేదు.

చివరికి తార్నాక నుండి మెట్టుగడ్డ వస్తున్న దారిలో సిటీ బస్సు షెల్టర్ లోపల దిమ్మె మీద ఓ భిక్షగత్తె పక్కన గుడ్డల్లో ముదిరి వున్న ఆకారం తాలూకు షర్ట్ కనిపించింది. ఎరుపు, పసుపు రంగుల్లో కొన్న ఫ్యాన్సీ షర్టు తళుక్కున మెరిసి తన బాబుదేనని గట్టిగా కేక వేసి స్కూటర్ ఆపించాడు భాస్కరరావు. వెళ్లి చూస్తే బాబే.

ముఖమంతా పీక్కుపోయి ఎముకలు తేలి వున్న ఆకారం. నెరిసిన చింపిరి జుత్తు, ఎండి పోయిన ఎద, బాగా చినిగి సగం దేహాన్ని సైతం కప్పలేని చీర. ఆ బిచ్చగత్తె చలికి వణికిపోతుంది. తన రెండు చేతులతో బాబు తల నిమురుతూ ఏమో చెపుతుంది. తనను ఎల్లవేళలా ప్రకృతి వైపరీత్యాలతో కాపాడే తన ఒకే ఒక్క ఆస్తి దుప్పటి. అదికాస్తా వాడి మీద కప్పేసింది. దాని నిండా మురికి. ముసురుకి ఎక్కడలేని ఈగలొచ్చి ఆ దుప్పటి మీదే వాలి ఉన్నాయి. తను వణికిపోతూ బాబుకి దుప్పటి కప్పిన తీరులోని ఆంతర్యం వెంటనే స్ఫురించలేదు వాళ్లిద్దరికీ... సరికదా బాబు బతికి ఉన్నాడా అన్న అనుమానంతో భాస్కరరావు వెంటనే బాబును ఎత్తుకున్నాడు.

వాడు కళ్ళు తేలవేసి చూనస్తూ... "ఐస్‌కీం... ఐస్‌కీం..." అంటున్నాడు. శరీరం భట్టీవలె, పొయ్యిమీది పెనంవలె కాలిపోతోంది.

"బాబును ఎందుకెత్తుకొచ్చావ్? ఎక్కడ అమ్ముదామనుకున్నావ్? బిచ్చపు ముండ" అన్నాడు భాస్కర్రావు బావమరిది ఆమెను కోపంతో...

ఆమె అతన్ని ప్రశాంతంగా, ఎంతో దయతో చూసింది. నిజంగా ఆ కళ్లలో కరుణరసం పొంగుతుంది.

ఒక్క నిముషం ఆలోచించిన భాస్కర్రావు "కాదు... బాబు జ్వరంతో బాధపడుతున్నాడు. ఆమె దుప్పటికప్పి ఈ షెడ్ కింద ఉంచింది కనుక నయమైంది. ఈ వర్షంలో వీడు ఇంత జ్వరంతో తడిస్తే మనకు మిగలడు. ఆమె మహాతల్లిలా వుంది" అన్నాడు.

"పో బావా! నీకందరూ మహాతల్లులే... బిచ్చపుదాన్ని వెనకేసుకొస్తూ..." అని "నడువు. మన వాళ్ళు ఎంత వెదుకుతున్నారో" అన్నాడు బావమరిది.

భాస్కర్రావు తన జేబులో నుండి పర్స్‌తీసి ఆమెకు ఇరవై రూపాయలివ్వబోయాడు. ఆమె ఆ కాగితం చూసి తల అడ్డం తిప్పింది. చేయి సైగతో బుక్కెడు అన్నం అని అర్థం చేయించింది. భాస్కర్రావుకి ఆశ్చర్యం, బావమరిదికి పిచ్చిదిలా తోచింది.

"వర్షం కాస్తా తగ్గాక పక్కవీధిలో ఉన్న పెండ్లి వాళ్ళ బంగళా దగ్గరికి రా... నీకు మంచి భోజనం పెట్టిస్తా" అన్నాడు భాస్కర్రావు.

అప్పటికే బావమరిది స్కూటర్ స్టార్ట్ చేశాడు. ముసురూ వెలిసింది. బాబుని రెండు బాహువుల్లోకి అదుముకొని కూర్చున్నాడు భాస్కర్రావు. స్కూటర్ వెళ్ళిపోయింది.

ఆ బిచ్చపు ముసలావిడ తన రెండు కాళ్ళ మీద కనీసం నిలబడలేదని వాళ్ళకు తెలియదు. ●

## మనుషులు మరెక్కడ లేరా?

మనం పుస్తకాల్లో చదివాం. కథల్లో విన్నాం. సినిమాలలో చూశాం. దేవుళ్ళకు, రాక్షసులకు, దేవతలకు వింత ఆకారాలు వున్నాయని, నాలుగు తలలు, మూడు కళ్ళు, ఎనిమిది చేతులు, సగం జంతువులా ఎన్నో వింతలు వున్నాయి. వీరంతా వేరే లోకాల్లో వుంటారనీ, ఎప్పుడైనా భూమి మీదకు వస్తారనీ కూడా చెబుతారు. మేఘాలమీద, ఎగిరే పళ్లాల ద్వారా, క్షణంలో ప్రత్యక్షమవుతారని కథలు అల్లారు. పిల్లలకు ఇలాంటివి చెప్పినప్పుడు, అవి కథలనీ, ఊహలనీ చెబితే సరే. కాని అలా జరగడం లేదు. అందుకే పెద్దవాళ్ళు అయినా చిన్నప్పటి వింత కథలు మనస్సునుండి తొలగకపోగా, అవన్నీ నిజాలనే దృష్టితో మొక్కులు పూజలు జరుపుతున్నారు. సైన్స్ పరిధిలో పరిణామం, సాపేక్షత, జీవుల పుట్టుక తెలుసుకుంటున్నారు.

ఇంతవరకు తెలిసిన ప్రకారం గాలి పీల్చుకొని బతికే జీవులు భూమికే పరిమితం. మిగిలినచోట్ల జీవులు వుండాలంటే ప్రాణవాయువు (ఆక్సిజన్) బదులు హైడ్రోజన్, ఇతర వాయువులు జీల్చి బతికేవారు కావాలి. భూమి మీద తప్ప ఆక్సిజన్ ఎక్కడా వున్నట్లు దాఖలాలు లేవు. జీవుల పరిణామానికి కార్బన్ ప్రధానంగా కావాలి. ఇందులో జీవాణువులున్నాయి. దీని అణువులు తీగలుగా మెలివేసుకుని, ఇతర అణువులతో కలుస్తాయి. సిలికాన్‌లోనూ ఇలాంటి కలయిక వున్నా, కార్బన్ అంత బంధం లేదు. జీవితాన్ని నిర్మించే అణుసముదాయం కార్బన్‌కే వుంది. కార్బన్‌లో అణువుల అనుబంధమే డెక్సే రైబోక్లీన్ డి.ఎన్.ఎ అణువులకూ, రైబోన్యూక్లిన్ యాసిడ్ ఆర్.ఎన్.ఎ.ల అణువులకూ దారితీసింది. వీటిచుట్టూ ప్రొటీన్లు, ఎంజైమ్‌లు, తగిన ఇతరాలు వచ్చాయి. జీవి లక్షణం ఏమంటే తన నుండి మరో జీవిని తయారు చేసి సమాచారాన్ని అందించడం. భూమ్మీద నాలుగు బిలియన్ సంవత్సరాల క్రితం జీవ సంబంధమైన పుట్టుక మొదలై, నేటి దశకు క్రమంగా పరిణమించింది. జీవోత్పత్తిని పెంచే ముందు, అందుకు అనుగుణమైన ఆర్ఎన్ఎ రైబోజైమ్స్ ఏర్పడ్డాయి. పరిణామం క్రమేణ నిరంతరంగా ఎలా కొనసాగుతున్నదో పరిశీలించారు. ఇది నిర్జీవ లోకంలోనూ, జీవలోకంలోనూ సాగుతున్నది. ఇంతవరకూ పరిశీలించిన దానిని బట్టి, గ్రహాలలో, తారలలో మరెక్కడా జీవ లక్షణాలు కనిపించలేదు. ఒకటి రెండు గ్రహాలలో ప్రాథమిక జీవ లక్షణాలకు అనువైన వాతావరణం మాత్రమే ఒకప్పుడు వుండేదన్నారు. భూమి మీద జీవరాశిలో కూడా మనుషులు మాత్రమే మాట్లాడడం, రాయడం, జ్ఞాపకశక్తితో ఆలోచనలకు రూప కల్పన చేయడం కనుగొన్నారు.

ఇతర లోకాల్లో జీవులు వుండాలంటే 40 సెంటిగ్రేడ్ డిగ్రీల వేడి వరకు వాతావరణం వుండే స్థితి కావాలి. అంతకు మించినా, సున్న స్థాయికి తగ్గినా ఎంజైమ్‌లు బతకడం కష్టం. రేడియేషన్ తీవ్రంగా వున్నా జీవరసాయనిక చర్య పూర్తిగా దెబ్బతింటుంది. అప్పుడు కణాల అభివృద్ధి జరగదు. భూమి మీద వున్న సమతుల్య వాతావరణం, ఇతరచోట్ల లేదు. భూమిపై మొక్కలు ప్రాణవాయువును వదిలి, బొగ్గుపులుసు వాయువును స్వీకరిస్తాయి. జంతువులు, మనుషులు బొగ్గుపులుసు వాయువును వదలి, ఆక్సిజన్ పీల్చుకుంటారు. ఇది ఇతర గ్రహాలు, నక్షత్రాలలో లేదు. అక్కడున్న గ్యాస్‌లు పీల్చుకొని జీవులు ఉండాలంటే, వారి ఊపిరితిత్తులు, జీవ విధానం భిన్నమైనది కావాలి. గురుత్వాకర్షణలో గ్రహాలు, నక్షత్రాలు భిన్నంగా వున్నాయి. భూమి మీద వున్నదానికీ, వాటికీ తేడా కనబడుతున్నది. గనుక జీవుల సైజు కూడా ఆ రకంగా మారాలి. శని గ్రహంలో చాలా ఎక్కువ గురుత్వాకర్షణ భూమితో పోల్చితే వుంది. చంద్రునిలో మనకంటే చాలా తక్కువ వుంది. కను కనే చంద్రుని పైకి కృత్రిమ నౌకలలో వెళ్ళిన మానవుడు ఆక్సిజన్ గొట్టాలు పెట్టుకున్నాడు. తేలిపోతున్నందున నడక కష్టమై, శిక్షణ పొందాల్సి వచ్చింది. మెదడు ఒక్కటి వుంటేనే మన రక్తంలో చాలా భాగం దానికి పోతుంది. నాలుగు తలలు వుంటే ఎంతో రక్తం నాలుగు మెదడులకు కావాలి. అంతేకాక ఒక గుండే తట్టుకోలేదు. కాబట్టి మన పురాణాలలో వింత జీవులు, దేవుళ్ళు, దేవతలు వూహాజనితాలని తెలుసుకోవాలి.

ఏమైనా ఇంతవరకూ భూమిపై తప్ప మరెక్కడా మనుషులున్నట్లు రుజువుకాలేదు.

– ఎన్. ఇన్నయ్య